కొరవడిన చెత్తశుద్ధి

- ఇంటింటికీ వాహనాలు వస్తున్నా రోడ్లపైనే చెత్త
- వ్యాపారస్తుల తీరుతో సమస్య మరింత జటిలం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో చెత్త విషయంలో ప్రజలకు చిత్తశుద్ధి కరువైంది. ప్రజలు వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన చెత్తను పడేస్తున్నారు. ప్రజల తీరుపై చెత్తను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అడిగి మరీ చెత్తను సేకరిస్తున్నా కొందరు మాత్రం రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్ద అయితే 70 శాతం జనాభా చెత్త వాహనాలు వస్తున్నప్పుడు డబ్బాల్లో చెత్తను వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్నారు. కొందరు మాత్రం రోడ్లపైనే పడేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెత్తను రోడ్లపై వేయకుండా మీ వద్దకు వచ్చే వాహనాల్లో వేయాలని అవగాహనా సదస్సులు ఏర్పాటుచేసి ప్రతి ఇంటికీ తడి పొడి చెత్తలు నిమిత్తం రెండేసి డస్ట్‌బిన్‌లు కూడా అందజేశారు. అంతే కాకుండా నేటికి ప్రతి వాహనానికి మైక్ అనౌన్స్ మెంట్ ద్వారా రోడ్లపై చెత్తను వేయవద్దు మీ ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు చెత్తను అందించాలనే సమాచారం చెబుతున్నారు. ఇక వ్యాపార సంస్థల వద్దకు వచ్చేసరికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అనేక అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి చెత్తను రోడ్లపై వేయవద్దని సూచనలు చేశారు. కానీ నేడు వ్యాపార సంస్థల వద్ద రోడ్డుపైనే చెత్తను వేస్తున్నారు. వ్యాపార సముదాయాలు మూసేసిన తర్వాత రాత్రి సమయంలో ఆయా ప్రాంతాల్లో రోడ్డు చివరలో ప్లాస్టిక్ సంచులు, గోదాలు, ప్లాస్టిక్ కవర్లు, అట్టపెట్టెలు, బేళ్లకు కట్టే వైర్ తాళ్లు ఇలా ఏదిపడితే అవి రోడ్లపై వేసేస్తున్నారు.

అనేక అనార్థాలు

రోడ్లపై ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తను, కట్టలు కట్టి పడేసే వైర్లు రోడ్లపై పడేయడం వల్ల రోడ్లపై తిరిగే పశువులు వాటిని తినడం ద్వారా అవి కొన్నాళ్లకు అనారోగ్యాలకు గురవుతున్నాయి. అంతే కాకుండా రోడ్లపై అవి వేసే పేడ, మూత్రంతో దుర్వాసన వస్తున్నాయి. అలాగే రోడ్లపై వేసే కవర్లు గాలికి ఎగిరి పేడకు, మూత్రంపై తడికి కవర్లు అంటుకుంటున్నాయి. దీనివల్ల రోడ్లపై వెళ్లే వాహనదారులకు కవర్లే కనిపిస్తున్నాయి తప్ప వాటి కింద ఉన్న వ్యర్థాలు కనిపించక వాహనాలు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యం నరకం

నిత్యం ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నా వ్యాపార సముదాయాల వద్ద మాత్రం రాత్రి సమయాల్లో రోడ్లపై చెత్తను వేసి వెళ్లిపోతున్నారని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. వ్యాపార సంస్థల వద్ద సంచుల్లోనో పెట్లలోనో చెత్తను వేసి బయట పెట్టి వెళ్లినా తాము సేకరించుకుంటామని చెబుతున్నారు. అలాగే కొబ్బరి బొండాలు సైతం రోడ్డు పక్కనే పడేసి వెళ్లిపోతున్నారని వాపోతున్నారు. వాటిని వాహనాల్లోకి వేయాలంటే తలకుమించిన భారం అవుతుందని పేర్కొంటున్నారు. తమ చెత్త వాహనం అంతా ఆ కొబ్బరి బొండాలకే నిండిపోతుందని, బొండాల వల్ల ప్రస్తుతం డంపింగ్ యార్డు కొండలా పేరుకుపోయిందని చెబుతున్నారు. వాడేసిన బొండాలను రెండు చెక్కలుగా పగలగొట్టి చెత్త వాహనాలకు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజలతో పాటు వ్యాపారస్తులు చెత్త విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరుతున్నారు.



కారుమూరి వారి వీధిలో చెత్తను సంచిలోకి ఎత్తుకుంటున్న పారిశుద్ధ్య కార్మికుడు



మారుతి సెంటర్ వద్ద రాత్రి సమయంలో రోడ్డుపై పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



బొనగిరి వారి వీధిలో మెయిన్ రోడ్డు పక్కనే ప్లాస్టిక్ సంచులు, కవర్లు

అపరాధ రుసుం విధిస్తాం



మునిసిపల్, సచివాలయ సిబ్బంది ఇంటింటికి, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి చెత్తను రోడ్లపై వేయవద్దని చెబుతున్నారు. అయినా కొందరు రోడ్లపైనే చెత్తను వేస్తున్నారు. వ్యాపార సంస్థల వద్ద అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వ్యాపారస్తులకు మళ్లీ సూచనలు చేస్తాం. సూచనలు చేసిన తరువాత కూడా రోడ్లపై చెత్తను వేస్తే మాత్రం వారికి అపరాధ రుసుములు విధిస్తాం. అయినా మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలి



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పారిశుద్ధ్య కార్మికులు వృత్తి నిర్వహణతో పాటుగా ఆరోగ్య సూత్రాలు పాటించే అంశంలో శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. కమిషనర్ శనివారం పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్మికులు రక్షణ పరికరాలు లేకుండా పనులు నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. గ్లౌస్‌లు, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు సమకూర్చాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ తదితరులు ఉన్నారు.

నన్నయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు విద్యార్థి ఎంపిక



సాయి సుశాంత్

నరసాపురం: స్థానిక శ్రీ సూర్యా డిగ్రీ కళాశాల విద్యార్థి ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న బొగరాజు సాయి సుశాంత్ ఇటీవల నిర్వహించిన సెలెక్షన్స్‌లో ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ శనివారం విలేకరులకు చెప్పారు. చదువుతో పాటు క్రికెట్‌లో ప్రతిభ చూపిస్తున్న సుశాంత్ యూనివర్సిటీ జట్టులో ఫాస్ట్ బౌలింగ్‌తో పాటు, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు. సుశాంత్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

లూసీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



కుష్టు రోగులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పాస్టర్ విజయకుమార్

నరసాపురం రూరల్: సమాజంలోని పేదలకు, వృద్ధులు, వికలాంగులు, కుష్టు రోగులకు సేవలందించడంలో గత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లూసీ టబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు నేతలు పేర్కొన్నారు. శనివారం మండలం రుస్తుంబాదలోని లెప్రసీ కాలనీలోలూసీ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ పాస్టర్ విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మామిడిశెట్టి యేషయ్య మాట్లాడుతూ గత ఏడేళ్లుగా అర్హులైన పేదలకు సేవా కార్యక్రమాలను చేపట్టడుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కరికీ 10 కిలోల బియ్యం అందించారు. రుస్తుంబాదలోని పేదలు 120 మందికి రగ్గులు పంపిణీ చేశారు. 200 మందికి కొత్త సంవత్సర క్యాలెండర్‌లను, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడిశెట్టి ప్రశాంతి, భవ్య, పరిమళజ్యోతి పాల్గొన్నారు.

వైద్య సేవల్లో లంకలకోడేరు పీహెచ్‌సీ రికార్డు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడంలో గ్రేడ్ వన్ ప్రథమ స్థానంలో నిలిచిందని డాక్టర్ ప్రతాప్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. ప్రతిరోజూ ఇన్పేషెంట్లకు, అవుట్ పేషెంట్లకు ల్యాబ్ టెస్టులు చేయడంలో, గర్భిణులకు ప్రసవాలు చేయడంతో రాష్ట్రంలో గ్రేడ్ వన్ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క నవంబర్ నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది ప్రసవాలు చేయడంతో కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సిబ్బందిని అభినందించారని పేర్కొన్నారు.

జిన్నూరులో రెవెన్యూ సదస్సు

పోడూరు: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను 45 రోజుల్లో పరిష్కరిస్తామని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. జిన్నూరు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో రైతుల నుంచి అధికారులకు 10 వినతులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

టెలీ కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్యం

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పటల్ వైద్యుడు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు) టెలి కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది అబ్బిరాజుపాలెం సెంటర్లో శనివారం హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఫోన్‌లో వారి ఆరోగ్య ఇబ్బందులను డాక్టర్‌కు చెప్పించారు. టెలీకాలింగ్ ద్వారా 15 మంది వైద్య సేవలను పొందారు.

పారా లీగల్ వలంటీర్లు బాధ్యతగా పని చేయాలి



పారా లీగల్ వలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విజయదుర్గ

నరసాపురం: న్యాయసేవాధికార సంస్థ ద్వారా నియమితులైన పారా లీగల్ వలంటీర్లు బాధ్యతతో పని చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ సూచించారు. శనివారం పారా లీగల్ వలంటీర్లకు కోర్టు వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి చట్టాలపై న్యాయ సేవా కార్యకర్తలు అవగాహన కల్పించాలని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు సంబంధించిన వివాహాలు, వాటి చట్టాలపై అవగాహన కల్పించారు. వివాహాలను కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యత, అరెస్టులు, బెయిల్స్, ముద్దాయిల హక్కులు, గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న పారాలీగల్ వలంటీర్లకు గుర్తింపు కార్డులు జడ్జి విజయదుర్గ అందించారు.

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



స్టాకు రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఎల్ఈడీ లైట్లు స్టాకు ఎంత వరకూ ఉంది? ఎక్కడైనా లైట్లు మరమ్మతులు చేయాల్సి వస్తే సరిపడగా సామగ్రి అందుబాటులో ఉందా? అనే అంశాలను ఆరా తీశారు. పండుగకు దూరప్రాంతాల నుంచి సొంతూళ్లకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని వీధిదీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైట్లు ఏఏ ప్రాంతాల్లో వెలగడం లేదో తనిఖీ చేసి లైట్లు అమర్చాలని ఆదేశాలు ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

పెట్రో కెమికల్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆండాళ్లు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ సృజనాత్మకత, కమ్యూనికేషన్స్ స్కిల్స్, పరిశోధనలపై అభిరుచి పెంచుకునేందుకు కృషి చేయాలని సత్యసాయి ఉన్నత విద్యా సంస్థల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ హానరరీ ప్రొఫెసర్ బి.ఆండాళ్లు అన్నారు. శనివారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు పెట్రో కెమికల్స్‌పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆండాళ్లు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందడానికి ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, నందుల సీతారామారావు, అధ్యాపకులు జానకి రామయ్య, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

మొగల్తూరు: అంధులు సైతం ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని ఎంఈఓ శామ్యూల్ జాన్ కోరారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా శనివారం మొగల్తూరులోని భవిత కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అంధులు ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. దివ్యాంగులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడరాదన్నారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు గంగాధరరావు, రోజిలిన్, డాక్టర్ అమోస్, జి.రమేష్ బాబుతదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ దేశాల్లో బ్రెయిలీ లిపి ద్వారా కోట్లాదిమంది అంధులకు మరోజన్మను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ బ్రెయిలీ జీవితం ప్రపంచానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓ దాశి రాజు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి బి.రామ్ కుమార్, సర్వశిక్ష అభియాన్ ఏపీఓ పి.శ్యామ్ సుందర్, రాష్ట్ర దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: అంధుల కోసం ఆరు చుక్కలతో లిపిని రూపొందించి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని పోడూరు ఎంఈఓ–1 జీవీఎస్ విజయకుమార్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని శనివారం ఎంఆర్సీలో ఘనంగా నిర్వహించారు. మండల ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ లూయిస్ బ్రెయిలీ ముఖచిత్రంతో 2009లో భారత ప్రభుత్వం విడుదల చేసిన రెండు రూపాయాల నాణేలను కన్ను ఆకారంలోనూ, బ్రెయిలీ లిపిలో ఉన్న అంకెలతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఎంఈఓ–1 జీవీఎస్ విజయకుమార్ ఆవిష్కరించారు.



మొగల్తూరు: భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి రామానాయుడు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: పేదరికం విద్యకు అడ్డురాకూడదనే విద్యా, వైద్యానికి కూటమి భుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రితో పాటు జిల్లాజాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిలు ఇద్దరూ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, డీఈఓ ఇ.నారాయణ పాల్గొన్నారు. అలాగే స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు విలేకరులకు తెలిపారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులంతా తిని మంచి ఆరోగ్యాన్ని పొందాలని మాజీ ఎంపీపీ రావూరి వెంకట రమణ బుజ్జి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఐ.నాగజ్యోతి, సర్పంచ్ బర్రే మేరి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మీ శ్రీనివాస్, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: ప్రభుత్వ పథకాలకు త్యాగధనుల పేర్లు పెడుతున్నామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంటలోని ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి, విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య పాల్గొన్నారు. అనంతరం ఆచంట కూడలిని పరిశీలించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మాల మహానాడు సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం ఆచంట వేమవరం నుంచి రాష్ట్ర వ్యాప్త నిరసనకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. తొలుత పాలకొల్లు నరసాపురం మీదుగా వెళ్లి ఆర్డీఓ దాసి రాజుకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. వన్‌మ్యాన్ కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సచివాలయంలో కులగణన దొంగచాటుగా జరుగుతుందని చెప్పారు. దొంగచాటుగా చేసే కార్యక్రమాన్ని ఆపాలని లేకపోతే తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఇకనైనా ప్రభుత్వం వన్‌మ్యాన్ కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా కార్యదర్శులు చిల్లే రాజ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్, తొర్లపాటి భాగ్యరాజా, కోలాటి ప్రసాదరావు, పిట్లా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న దివ్య కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణోత్సవ విగ్రహాలతో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం 7 గంటలకు యాదంరెడ్డి సత్యం గురుస్వామి దంపతులతో గణపతి హోమం నిర్వహించారు. స్థానిక పెనుమదం రోడ్డులో ఉన్న ఆర్ ఆర్ రైస్ మిల్లులో విద్యుద్దీపాలంకరణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆదివారం సామూహిక ఉచిత సత్యదేవుని వ్రతాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం లక్ష్మీనారాయణ ఫ్రూట్స్ వారి ఆధ్వర్యంలో సత్యదేవుని హోమం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నవరం సత్యదేవుని వ్రత రథం, పురోహితులు ఆధ్వర్యంలో 2 వేల కలశాలతో ఈ వ్రతం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల నాగశ్రీనివాసు, గౌరవ అధ్యక్షులు బీరక ప్రసాద్, కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాస్, గాదె వెంకన్న, పెనుమాక రామ్మోహనరావు, రెడ్డి చిన్ని తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్: గణపతి హోమంలో పూర్ణాహుతి చేస్తున్న భక్తులు

ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు దర్శనానంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ధనుర్మాసం.. ఆ గ్రామం ప్రత్యేకం

నరసాపురం రూరల్: ధనుర్మాసం అంటే వైష్ణవ భక్తులకు ఎంతో ప్రత్యేకం. ఇలాంటి ధనుర్మాసంలో వైష్ణవ ఆచారం పాటిస్తూ మండలంలోని పసలదీవి గ్రామం తన ప్రత్యేకతను చాటుకుంటుంది. గ్రామంలో ప్రతి ఇంట్లో ఈ మాసం మొత్తం భగవన్నామస్మరణ మారుమోగుతోంది. ఈ గ్రామంలో ఇంచుమించుగా అన్ని కుటుంబాలు క్రమం తప్పకుండా ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తున్నారు. స్థానిక రామాలయం కేంద్రంగా ప్రత్యేకంగా పూజలు చేస్తూ ఉంటారు. సుమారు ఎనభై ఏళ్ల నుంచి ఈ గ్రామంలో వైష్ణవ సంప్రదాయం ఆచరిస్తున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. 1950 ప్రాంతంలో కమ్మగురువుగా పేర్కొనే స్వామి కాలినడకన గ్రామం చేరుకుని కృష్ణుని ఆరాధించమని చెప్పడంతోపాటు శ్రీకృష్ణ పరమాత్మను గురించిన విషయాలు చెప్పేవారని, ఆయన లీలను గురించి వివరిస్తూండేవారని పెద్దలు పేర్కొంటున్నారు. అనంతరం 1976 ప్రాంతంలో రేపల్లె నుంచి రాఘవాచార్యులు అనే స్వామిజీ ఆయన తదుపరి ఆయన దత్తత కుమారుడు గోపాలకృష్ణమాచార్యులు తదితరులు వచ్చి గ్రామంలో విష్ణువు ఆరాధనకు సంబంధించిన విశిష్టత చెప్పడంతో ఆరాధించే విధానాలను వివరించారని గ్రామస్తులు చెబుతున్నారు.

80 శాతం మంది వైష్ణవులే

గ్రామంలో ఉన్న జనాభాలో సుమారు 80 శాతం వరకూ వైష్ణవ సంప్రదాయం పాటిస్తున్నారు. ముఖ్యంగా ధనుర్మాసం 30 రోజులూ గ్రామంలో శ్రీమాన్ ముడుంబై వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రసాద వినియోగం చేయడంతోపాటు పాశురాలను గురించి వివరిస్తున్నారు. గ్రామంలో కొట్టు, పులపర్తి, పోలిశెట్టి తదితర కుటుంబికులంతా వైష్ణవ మతాన్ని స్వీకరించి ఆచరిస్తున్నారు. స్థానిక రామాలంలో ప్రతిరోజూ గోదాదేవికి విశేష పూజలు నిర్వహిస్తూ ఉంటారు. గ్రామంలోని పలువురు వైష్ణవ భక్తులు ఎంతోకాలంగా చక్రాంతకాలు స్వీకరించి వైష్ణవ సంప్రదాయాలు పాటిస్తున్నారు. ముఖ్యంగా ఈ గ్రామంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సహకారంతో తిరుప్పావై ప్రవచనాలను వివరించేందుకు పండితులను నియమించేవారని పండితుడు ముడుంబై వెంకటనరసింహాచార్యులు పేర్కొన్నారు. ధనుర్మాస వ్రతాన్ని ఆచరించే వారికి అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని చెబుతున్నారు.



పసలదీవి రామాలయంలో తిరుప్పావై ప్రవచనాలను చెబుతున్న దృశ్యం, గోదాదేవి వ్రత దీక్షను చేస్తున్న భక్తులు